

పోలవరం నిర్వాసితులకు బాసటగా...

- వంశధార, ఆఫ్‌షోర్ నిర్వాసితుల సంఘీభావం
- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- పోరాటం జయప్రదం కావాలని ఆకాంక్ష



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

పోలవరం నిర్వాసితుల పాదయాత్రకు జిల్లాలోనూ సంఘీభావం వ్యక్తమవుతోంది. నిర్వాసితుల సమస్యలపై పోరుకేక పేరుతో అల్లూరి సీతారామరాజు జిల్లా నెలిపాక ఈనెల 20వ తేదీ నుంచి సిపిఎం చేపట్టిన పాదయాత్రకు మంచి స్పందన వస్తోంది. పలు దినపత్రికల్లో వస్తున్న వార్తలను చూసి తమకు జరిగిన అన్యాయమే పోలవరం నిర్వాసితులకూ జరిగిందని జిల్లాకు సంబంధించిన పలు ప్రాజెక్టుల నిర్వాసితులు సానుభూతి తెలుపుతున్నారు. ప్రాజెక్టుల కోసం భూములు తీసుకుని మెరుగైన ప్యాకేజీ, డబ్బులు వస్తాయని ఆశ చూపడం, ఆ తర్వాత మోసం చేయడం పాలకులకు అలవాటుగా మారిందని నిందిస్తున్నారు. పోలవరం నిర్వాసితులు సాగిస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని, వారి సమస్యలు పరిష్కారం కావాలని ఆకాంక్షిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రకు బాసటగా ఉంటామని చెప్తున్నారు. పాలకుల మోసాన్ని ఎండగడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేపట్టిన సిపిఎంకు జేజేలు పలుకుతున్నారు. పోలవరం నిర్వాసితులకు మద్దతుగా వంశధార, ఆఫ్‌షోర్ నిర్వాసితులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు వారి మాటల్లోనే...

నిర్వాసితులకు ఎక్కడా మోసమే



ప్రభుత్వం భూములు తీసుకున్న తర్వాత నిర్వాసితులతో పనిలేనట్లుగా వ్యవహరిస్తోంది. పోలవరం నిర్వాసితులకు భూములకు డబ్బులు, ప్యాకేజీ ఇవ్వకుండా ఇచ్చిన మాట తప్పారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితులకు మాకూ అదే జరిగింది. ఇంటికి నష్ట పరిహారం రూ.25 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, రూ.8 లక్షలే ఇచ్చారు. నా ఇద్దరు కుమారులకు యూత్ ప్యాకేజీ ఇచ్చినా ఇంటి స్థలం ఇవ్వలేదు.

- పి.చిన్నకృష్ణమూర్తి, చీపురుపల్లి (మెళియాపుట్టి)

పోలవరం నిర్వాసితులకు అన్యాయం



పోలవరం నిర్వాసితుల సమస్యలపై పాదయాత్ర వార్తలను పత్రికల్లో చూశాం. పోలవరం నిర్వాసితులకు మాకు జరిగిన అన్యాయమే జరుగుతోంది. పరిహారం, పునరావాసం కల్పించకుండానే భూములు తీసుకుని, గ్రామాల నుంచి పంపేయాలని చూడడం అన్యాయం. పోలవరం నిర్వాసితులకు సరిగా పరిహారం డబ్బులు ఇవ్వకపోవడం సరికాదు. వరద వచ్చే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడం అన్యాయం. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

- పి.రామరాజు
ఇరపాడు (వంశధార నిర్వాసితుడు)

పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కరిస్తున్నారు



వంశధార నిర్వాసితులకు 2013 చట్టం అమలు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా జిల్లాకు వచ్చినప్పుడు చెప్పారు. రెండేళ్ల పాటు ఉద్యమం చేస్తే ఎక్స్‌గ్రేషియో పేరుతో రూ.లక్ష ఇచ్చారు. ఆ డబ్బులు కూడా అందరికీ అందలేదు. మాకు ఇవ్వాల్సిన డబ్బులు సరిగా ఇవ్వనట్లుగానే పోలవరం వారికీ ఇవ్వలేదు. నిర్వాసితులను మోసం చేయడం పాలకులకు అలవాటుగా మారింది.

- పి.రాణి,
అడవి కొత్తూరు, కొత్తూరు మండలం

నిర్వాసితులు ఎక్కడి వారైనా సమస్యలు అవే



జిల్లాలు మారినా నిర్వాసితుల సమస్యలు మారడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భూసేకరణ చట్టం అమలు చేస్తామని హామీనిచ్చి ఎక్స్‌గ్రేషియోతో సరిపెట్టారు. భూమికి, యూత్ ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన డబ్బులు ఇప్పటికీ జమ చేయలేదు. అటు పోలవరం నిర్వాసితులకూ ఏమీ ఇవ్వలేదని తెలుస్తోంది. భూములిచ్చి మోసపోవడం అన్నిచోట్లా జరుగుతోంది.

- సింహాచలం,
పెద్దమడి కొత్తూరు మండలం

ఆర్ అండ్ ఆర్ తేల్చకుండా ప్రాజెక్టు పనులు



ప్రభుత్వానికి ప్రాజెక్టుల మీద తప్ప ఆర్ అండ్ ఆర్ మీద శ్రద్ధ లేదు. పోలవరమైనా, ఆఫ్‌షోర్ రిజర్వాయరైనా ప్రభుత్వానికి ఒకటే తీరు. పునరావాసం, పరిహారం తేల్చకుండానే వాటిని నిర్మించేయాలని చూస్తోంది. రిజర్వాయర్‌కు నేను 3.20 ఎకరాల భూమి ఇచ్చాను. నా కుమార్తె పేరు యూత్ ప్యాకేజీ జాబితాలో ఉన్నా ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు.

- పిట్ట నీలయ్య,
ఆఫ్‌షోర్ నిర్వాసితుడు

ఆర్ అండ్ ఆర్ తేల్చకుండా ప్రాజెక్టు పనులు

పోలవరం స్ఫూర్తితో మరో పోరాటం



వంశధార నిర్వాసితుల సమస్యలపై పోలవరం స్ఫూర్తితో మరో పోరాటం చేస్తాం. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఎక్స్‌గ్రేషియో ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అవీ అరకొరగా ఇచ్చారు. తల్లిదండ్రులు మరణించిన కుటుంబాలకు చెందిన వారసులకు పరిహారం ఇవ్వడం లేదు. డిపట్టా భూములకు డబ్బులు చెల్లించలేదు. కాలనీల్లో ఇప్పటికీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం సరిగా కల్పించలేదు. వీటన్నింటిపై నిర్వాసితులు మరోసారి పోరుకు సిద్ధమవుతున్నారు.

- గంగరావు సింహాచలం,
రాష్ట్ర కార్యదర్శి, ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మాదకద్రవ్యాలు మానవాళి వినాశకాలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాదకద్రవ్యాలు మానవాళి వినాశకాలు అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని జెడ్‌పి కార్యాలయ ఆవరణలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యాన చేపట్టిన ర్యాలీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వీటి వాడకం వల్ల వ్యసనాలకు బానిసై ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారని చెప్పారు. మాదకద్రవ్యాలను నిరోధించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, అమ్మకం, వినియోగం విషయమై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అందుకోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడతున్నట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎడిఎంహెచ్‌ఒ ఎన్.అనురాధ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్న వామపక్ష నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి - మందస / పలాస

రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు, సర్‌ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యాన మందస బస్టాండ్ వద్ద సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ అధినేత, వ్యాపారవేత్త వడ్డి గోపాలకృష్ణ సంతకాల సేకరణను ప్రారంభించి మొదటి సంతకం చేశారు. విద్యుత్ ఛార్జీల భారం ప్రజలందరిపై పడిందని, ఈ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నాయకులు సిహెచ్.సుందరలాల్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు మద్దిలి రామారావు మాట్లాడుతూ మోడీకి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం సరికాదన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెరగడం వల్ల వినియోగదారులపై ప్రత్యక్ష భారం పడుతుందని చెప్పారు. పరోక్షంగా ఇతర వినిమయ సరుకుల ధరలూ పెరిగి మరింత భారమవుతుందని తెలిపారు. 2014-19 సంవత్సరంలో ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ చెల్లించకుండా ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో వసూళ్లు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 30వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపడతామని చెప్పారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు పార్టీలు, సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, ఎం.ధర్మారావు, ఎస్.వల్లభరావు, అల్లాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరు అందించాలి

ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతుసంఘం ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్ సాగుకు ముందే వంశధార, నాగావళి కాలువల మరమ్మతులు చేపట్టి శివారు భూములకు సాగునీరందించాలని రైతు, కౌలురైతు సంఘాల నాయకులు పొందూరు చంద్రరావు, భవిరి కృష్ణమూర్తి, వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నగరంలోని వంశధార సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైనా నేటికీ కాలువల మరమ్మతులకు నోచుకోలేదన్నారు. కొన్నిచోట్ల కాలువలు ఆక్రమణలకు గురి కాగా, మరికొన్ని చోట్ల గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో నిండిపోయాయన్నారు. కాలువల పొడవునా షట్టర్లు లేక సాగునీరు కాలువల్లో ప్రవహించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. దీనివల్ల శివారు భూములకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌కు సిద్ధం కావాల్సిన రైతాంగానికి ఎరువులు, విత్తనాలు అని చెప్తున్నారే తప్ప సాగునీటి అవసరాలు తీర్చే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదన్నారు. ఏటా జూలై, ఆగస్టులో కాలువల మరమ్మతులు చేయడం వల్ల ప్రయోజనం ఉండడం లేదన్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గండ్లు పూడ్చడం, షట్టర్లు ఏర్పాటు వంటి మరమ్మతులు చేపట్టాల్సి ఉందని చెప్పారు. మరమ్మతులకు అంచనాలు పంపించి బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా పట్టించుకునే వారు కనిపించడం లేదన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోటబొమ్మాళి మండలం కొండపేట ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపట్టాలని, తోటపల్లి కాలువల పనులు త్వరితగతిన పూర్తి చేసి లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాలకు సాగునీరు అందించాలన్నారు. గార మండలం సతివాడ నుంచి శ్రీకూర్మం వరకు ఉన్న కాలువల మరమ్మతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వంశధార ఎస్‌ఇ కార్యాలయ సీనియర్ సహాయకులు పద్మజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం అధ్యక్షులు వెలమల రమణ, తోనంగి నందోడు పంచిరెడ్డి సత్యనారాయణ, బెండి మల్లేష్, పి.వెంకటరమణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నాయకులు

పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీలు

- శ్రామిక మహిళా సంఘం వినతి
- 'స్పందన'కు 213 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రామిక మహిళల పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 213 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ వినతులు స్వీకరించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా ఉందని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల బారిన పడి తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతన చట్టం ఉన్నా అనేక సెక్టార్లలో అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు శాఖలు, సంస్థల్లో టాయిలెట్స్, మంచినీరు, విశ్రాంతి గదులు, భద్రతా సౌకర్యాల్లేక శ్రామిక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తూ కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల అమ్మకంపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.రాజు, బి.హరీష్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సంతోష్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు.

ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు డిఇఒ తిరుమల చైతన్య పాల్పడ్డారని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకర రావు, ఎస్.రమణమ్మ, డి.శివ జ్యోతి తదితరులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆమోదించిన 12మంది మెడికల్ ప్రిఫరెన్షియల్‌ను పరిగణన లోకి తీసుకోలేదని, దీనివల్ల అనారోగ్య సమస్యలున్న వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బదిలీల కౌన్సెలింగ్‌పై విచారణ చేయించాలని కోరారు.

శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగనగళ్లవానిపేట పంచాయతీలో చేపల చెరువుల వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సముద్రపు నీరు కాల్వల్లోకి వెళ్లకుండా గ్రామాల్లోకి చొచ్చుకుని వచ్చి కోతకు గురవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. ఆమెతో పాటు మత్స్యకార సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పొందూరు మండల కేంద్రంలోని 13 షెడ్యూల్డ్ కులాలకు చెందిన పైడికొండ భూములను రియల్టర్ రామ్మోహనరావు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని, ఆ భూములు తిరిగి ఇవ్వాలని తిరుపతి శ్రీనివాసరావు స్పందనలో ఫిర్యాదు అందజేశారు. కంచిలి మండలం పోలేరు యుపి స్కూల్లో మూడేళ్లుగా ఎస్‌జిటిగా పనిచేస్తున్నానని, అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రికి సేవలు చేసేందుకు సమీప పాఠశాలకు బదిలీ చేయాలని అరసవల్లికి చెందిన ఎ.సరళ వినతిపత్రం అందజేశారు.

సంతబొమ్మాళి మండలం నౌపడలో కొత్తగుండం చెరువు కబ్జా చేసిన వారిని వదిలేసి తమ ఆస్తులపై దాడులు చేస్తున్నారని కెనడియన్ బాప్టిస్టు మిషన్ సంస్థల పరిరక్షణ కమిటీ మెంబర్ చక్రవర్తి ఫిర్యాదు చేశారు. చెరువులు కబ్జాకు గురైన తర్వాత ఈ ప్రాంతంలో మురుగునీరు, వర్షపునీరు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఫిర్యాదు చేశారు. వీటితో పాటు పలు వినతులు వచ్చాయి.



జెసికి వినతిపత్రం అందజేస్తున్న నాగమణి, తేజేశ్వరరావు

వినతుల పెండింగ్‌పై నిర్లక్ష్యం తగదు

స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో వస్తున్న ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు సకాలంలో స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. పలు పోర్టర్లలో 32 వినతులు పెండింగ్‌లో ఉన్నాయని, కొత్తగా రీ ఓపెన్ అవుతున్న వినతులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిప్యూటీ కలెక్టర్లు జయదేవి, సుమబాల పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబువి అబద్ధపు హామీలు


రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు అబద్ధపు హామీలు గుప్పిస్తున్నారని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఆయన ఎన్ని హామీలిచ్చినా ప్రజలు మాత్రం నిన్ను నమ్మం బాబు అంటున్నారని తెలిపారు. మండలంలోని చినవంక పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు 600 హామీలతో 2014లో అధికారంలోకి వచ్చి కనీసం ఆరు హామీలైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. టిడిపి పాలనలో జన్మభూమి కమిటీల పెత్తనంతో దోపిడీకి తెరతీశారని విమర్శించారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే రాష్ట్రం అప్పులపాలవుతోందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఇప్పుడు తానే ఎక్కువ పథకాలు ఇస్తానని మేనిఫేస్టో విడుదల చేయడం ప్రజలను మభ్యపెట్టడానికేనన్నారు. చంద్రబాబు పాలనను ఎవరైనా కోరుకుంటారా అని ప్రశ్నించారు. గౌతు కుటుంబ 60 ఏళ్ల పాలనలో ఏం అభివృద్ధి జరిగిందో చెప్పాలన్నారు. ఉద్దానంలో ఒక రోడ్డు వేశారా? నియోజకవర్గానికి శాశ్వత ప్రాజెక్టును ఏమైనా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో గౌతు కుటుంబాన్ని నియోజకవర్గం నుంచి శాశ్వతంగా సాగనంపాలని పిలుపునిచ్చారు. గుల్లలపాడు రోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యానాయుడు, ఉప సర్పంచ్ రెయ్యి శ్రీనివాస్, సైని కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని పలువురు మహిళలు మంత్రికి వినతిపత్రం అందజేశారు. జీడి పంట తమకు ప్రధాన జీవనాధారమని, మద్దతు ధర లేకపోవడంతో పెట్టుబడి సొమ్ము కూడా రాక అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కిలోల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బి.రమాదేవి, యు.నీలవేణి తదితరులున్నారు.



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

51 మందికి 'లా నేస్తం' లబ్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో అర్హులైన 51 మంది జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం పథకం కింద రూ.12.50 లక్షలు జమ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఐదో విడత 'లా నేస్తం' నిధులను సోమవారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా నేస్తం పథకం ద్వారా లాయర్ల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. లా డిగ్రీ తీసుకున్న తర్వాత తొలి మూడేళ్లు న్యాయవాదిగా స్థిరపడేందుకు 'లా నేస్తం' కింద ఇచ్చే స్టైఫండ్ ఆర్థిక భరోసాను ఇస్తుందన్నారు. అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.ఐదు వేలు స్టైఫండ్ చొప్పున ఐదు నెలలకు రూ.25 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, పలు శాఖల అధికారులు, లబ్ధిదారులైన లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ హర్షం

లా నేస్తం నిధుల విడుదలపై బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, గేదెల వాసుదేవరావు, కె.ఆఫీసునాయుడు తదితరులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. లా గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారు వృత్తిలో నిలదొక్కునేలా మూడేళ్ల పాటు ఏటా రూ.60 వేలు చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తోందని తెలిపారు.

రేపు యువజనోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువతలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈనెల 28వ తేదీన యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆరోజు ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జెడ్‌పి సమావేశ మందిరంలో యువజనోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం 2047 అనే థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్‌వైకె యూత్ కోఆర్డినేటర్ ఉజ్వల్ మాట్లాడుతూ పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతిభావంతులకు జాతీయస్థాయి వరకు యువ ఉత్సవ్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. 15 నుంచి 29 మధ్య వయసు గల ఔత్సాహికులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో 94921 18960 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.



యువజనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు



ధర్నా చేస్తున్న గిరిజనులు

కంచిలిని సబ్‌ప్లాన్ ఏరియాలో చేర్చాలి

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి మండల పరిధిలోని గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలను అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కంచిలి మండలాన్ని ఎస్‌టి సబ్ ప్లాన్ ఏరియాలో చేర్చాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులకు ఉపయోగపడే విధంగా 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు బుయ్య రిషి, దేవ దత్త మండల్, సవిత మండల్, రైక రాజు, బుయ్య చైతన్య, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి స్పందనకు 33 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజలను వచ్చిన అర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎస్‌పి జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 33 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, సమస్యలను తెలియపరిచారు. వాటిని పరిశీలించి చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలనిఆదేశించారు. ప్రతి బాధితునికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు. మోస పూరిత ఫిర్యాదులు మూడు, కుటుంబ తగాదాలు మూడు, పాత ఫిర్యాదులు రెండు, ఆస్తి తగాదాలు పది, ఇతర ఫిర్యాదులు 15 వచ్చాయి.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పూడికలు తొలగించాలని వినతి

జి.సిగడాం : మండలంలోని బాతువ బరపాత్వాన్ని చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయిందని, దీంతో నీరు నిల్వ ఉండడం లేదని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెలమల రమణ అన్నారు. గుర్రపు డెక్కను తొలగించేదుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఎస్ఇ కార్యాలయ సూపరింటెండెంట్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మడ్డువలస నుంచి మండలానికి రావాల్సిన సాగునీరు త్వరగా వచ్చేలా కృషి చేయాలన్నారు. కాలువుల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, కాలువలకు పడిన గండ్లను పూడ్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ప్రసాద్, తేనెల అప్పలనాయుడు, టి.సింహాచలం, బెవర సన్యాసప్పడు, ముళ్ల అసిరినాయుడు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బలి కావద్దు

ప్రజాశక్తి- పలాస

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ జాడ్యాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన తక్షణ ఆవశ్యకత ఉందని కాశీబుగ్గ డిఎస్‌పి జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు శాఖ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. డ్రగ్స్ రహిత సమాజం, యువత మేలుకో భవితను మలుచుకో డ్రగ్స్‌ను వదులుకో' అనే నినాదంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణకు కఠిన చట్టాలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో తప్పు చేసిన వారు ఎంతటి వారైనా తప్పించుకోలేరని అన్నారు. మత్తు పదార్థాలకు ఇట్టే ఆకర్షితులై బంగారు లాంటి తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. తొలుత సరదాగా మొదలై ఆ తర్వాత బానిసై మత్తు పదార్థాలు వాడకపోతే ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోదించాలన్నారు. కార్యక్రమంలో సిఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఇబి ఇన్‌ఛార్జి సిఐ కె.కృష్ణారావు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.మధు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకట మోహన్, ఎజిఎంఒ పి.చిరంజీవులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు పాల్గొన్నారు.

పొందూరు: మాదకద్రవ్యాలను వినియోగించడం ద్వారా యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మనోహర్, ఎస్ఇబి ఎస్ఐ వై.చంద్రమోహన్‌లు కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, ఎస్ఇబి సిబ్బందితో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఆమదాలవలస : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఇబి సబ్ ఇన్‌స్పెక్టర్ టి.హేమమందిర అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ జె.రవిబాబు అధ్యక్షతన మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత ఉజ్వల భవిష్యత్ కోసం నో టు డ్రగ్స్ - ఎస్ టూ లైఫ్ నినాదంతో ముందుకు పోవాలని ప్రతిజ్ఞ చేస్తూ అనంతరం భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రఘునందనరావు, కానిస్టేబుళ్లు వైకుంఠరావు, హేమసుందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సోంపేట : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, శ్రీకుమార్ జూనియర్ కళాశాల అధ్యక్షతన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి టి.వెంకటప్పలనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజాచక్రవర్తి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వెల వివేకానంద, ఎస్ఐ ఎల్.రామకృష్ణ, శిష్టు జగం, అట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఇబి అధికారులు


పలాస : ర్యాలీలో పాల్గొన్న డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి

రణస్థలం రూరల్ : అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ బి.హెచ్.కిరణ్‌మణిశ్వరి అధ్యక్షతన స్థానిక శాంతినికేతన్, సాయి డిగ్రీ కళాశాలల విద్యార్థులతో జె.ఆర్.పురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.కె.రహీం, శాంతినికేతన్, సాయి కళాశాలల ప్రిన్సిపాళ్లు కృష్ణ, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే మాదవ ద్రవ్యాలు ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పెషల్ రెండో తరగతి మేజిస్ట్రేట్ సీపాన భాస్కరరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవ సంఘం అధ్యక్షతన స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి న్యాయవాదులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పానెల్ న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, కె.అచ్చెన్నాయుడు, కోర్టు లైసోన్ కానిస్టేబుల్ బి.బాలకృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఇందిరా కుమారి పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం


ఆమదాలవలస : మంచినీటి బిందెను అందిస్తున్న స్పీకర్ సీతారాం

ఆమదాలవలస : జలజీవన్ మిషన్ పథకంతో గడపగడపకు తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని దివంజీపేటలో రూ.46 లక్షల నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సైలాడ, కుమ్మరిపేట గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.48 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందించాలన్న లక్ష్యంతో సిఎం జల జీవన్ మిషన్ పథకం ద్వారా త్వరితగతిన పనులు చేపడుతున్నారని అన్నారు. పేదల సంక్షేమమే పరమావధిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, సర్పంచ్ సైలాడ దాసునాయుడు, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ సూర్యనారాయణ, ఎఇ చంద్రమౌళి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొందూరు: నియోజకవర్గంలోని ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు కల్పనే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.85 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అద్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, జెఇ చైతన్య, మాజీ సర్పంచ్ గార రమణ, సూర్యారావు, గిరిబాబు పాల్గొన్నారు.

షాపుల తొలగింపు

ఇచ్ఛాపురం: పట్టణంలో ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని వక్ఫ్‌బోర్డుకు చెందిన పీర్ల పంజా స్థలాల్లోని షాపులను సోమవారం అధికారులు తొలగించారు. పీర్ల పంజాకు చెందిన వక్ఫ్ బోర్డు స్థలాలు సర్వే నంబరు 204/3లో నాలుగు ఎకరాల 82 సెంట్లు స్థలం ఉంది. ఇందులో ఎప్పటి నుంచో చిరు వ్యాపారులు షాపులు పెట్టి జీవనం సాగించారు. గతంలో అనేక సందర్భాల్లో షాపులను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ముస్లిం పెద్దలు రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 22న వక్ఫ్‌బోర్డు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి ముసాబిన్ ఇబ్రిహమ్ మున్సిపల్, రెవెన్యూ, పోలీసులు కలిసి వ్యాపారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. షాపులు తొలగించాలని ఈ నెల 25 తేదీ వరకూ గడువు విధించారు. దీంతో సోమవారం భారీ ఎత్తున పోలీస్ బలగాలు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, వక్ఫ్‌బోర్డు అధికారులు సమక్షంలో చిరు వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు తొలగించారు. గత 30 ఏళ్లుగా ఇదే స్థలంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించామని, ఇప్పుడు చెట్టుకు పుట్టలా చెల్లా చెదురయ్యామని బాధితులు వాపోయారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి మూసా బిన్ ఇబ్రహీం, ఇఒలు అబ్దుల్ కుద్దుసు, షేక్ సులేమాన్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాదిక్ షేక్, పీర్ల పంజా ముత్త వలి రబ్బాన, ఇన్‌ఛార్జి తహశీల్దార్ గురుప్రసాద్ పాల్గొన్నారు.


షాపులను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ఉచిత శిక్షణ

ఆమదాలవలస : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లలో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయిశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అసోసియేట్ ఎలక్ట్రీషియన్‌లో రెండు కోర్సులకు పది నుంచి డిగ్రీ విద్యార్హత కలిగి ఉన్న 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలతో పాటు ఉద్యోగ అవకాశాలూ కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7569077449 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


నిలిచిన వాహనాలు

స్తంభించిన ట్రాఫిక్

పలాస: కాశీబుగ్గ పెట్రోల్ బంకు తాళభద్ర రోడ్డుపై లాస్యప్రియా కళ్యాణ మండపం సమీపంలో స్క్రాప్ తీసుకువెళ్లే లారీ సోమవారం రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో అటు ఇటు వాహనాలు నిచిలిపోవడంతో ట్రాఫిక్‌కు జామ్ అయ్యింది. డ్రైవర్ లారీను సరిచేసే సమయంలో రోడ్డు చివరి భాగంలో లారీ చక్రాలు దిగబడిపోవడంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. ఆ సమయంలో పశుసంవర్ధకశాఖ శాఖ డాక్టర్ మంత్రి సీదిరి అప్పలరాజు వజ్రపుకొత్తూరు మండలం చినవంకలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమానికి నిర్వహించేందుకు వెళ్తున్నారు. ట్రాఫిక్ జామ్‌తో ముందుకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వెనుదిరిగి వేరే మార్గంలో వెళ్లారు. అయితే రోడ్డు మధ్యలో లారీ చాలా సమయం నిలిచిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం ప్రొక్లెయినర్ సహాయంతో లారీని పక్కకు పెట్టడంతో వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగాయి.

దుబాయ్‌లో జిల్లా వాసి మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి


అప్పారావు (ఫైల్)

మండలంలోని జగన్నాథపురానికి చెందిన అడ్ల అప్పారావు (38) సీమేన్ దుబాయ దగ్గర షిప్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆదివారం కుటుంబ సభ్యులకు షిప్ యాజమాన్యం సమాచారం అందించారు. ఆయన మృతి వార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు ఐదేళ్ల నుంచి సీమేన్‌గా పనిచేస్తున్నారు. మృతునికి భార్య గాయత్రి, ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు ఉన్నారు.

అంబికాదేవి ఆలయం సందర్శన

ఇచ్ఛాపురం : మండలంలోని ముచ్చింద్ర పంచాయతీ బెనుగానిపేటలో నూతనంగా నిర్మించిన అంబికాదేవి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో సోమవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. ముందుగా టిడిపి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు, ఎల్.పద్మనాభం, నందిక జాని, కొండ శంకర్‌రెడ్డి, రమేష్, పొందల కృష్ణారావు పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి

టెక్కలి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో గెస్టు ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి టి.చంద్రశేఖర్ కోరారు. కళాశాలలో అధ్యాపకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల సాధనకు న్యాయపరమైన పోరాటం ఐకమత్యంగా చేయాలన్నారు. బదిలీల్లోనూ భద్రత లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో రామారావు, జగన్, పార్వతి, ప్రసన్న, లలితాభాయ్, తరుణ్, వెంకట్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ని విస్మరించడం సరికాదు


విజయలక్ష్మి, సర్పంచ్

వజ్రపుకొత్తూరు : రాజ్యాంగ విలువలను కాపాడతానని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సర్పంచ్‌ను విస్మరించడం ద్వారా రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని చినవంక సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి మంత్రి తీరును దుయ్యబట్టారు. సోమవారం చినవంకలో విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం నిర్వహించడం మంత్రి దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. తమ పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలను మంత్రి వివక్ష చూపారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పిలకపోవడంతో గవర్నర్, కలెక్టర్, ప్రోటోకాల్ కమిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'పోరుకేక'కు విరాళాల సేకరణ


విరాళాలను సేకరిస్తున్న నాయకులు

కొత్తూరు : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20 నుంచి జులై 4 వరకు చేపడుతున్న మహా పాదయాత్రకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, నాయకులు నిమ్మక ప్రసాద్ సోమవారం విరాళాలు సేకరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద దుకాణాలకు వెళ్లి నిధులను సమీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బిజెపి ప్రభుత్వం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తామని చెప్పి విఫలమైందన్నారు. పాదయాత్ర ముగింపు రోజున సిపిఎం జాతీయ నాయకులు బి.వి.రాఘవులు, వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తెల్లన్న, దుర్గారావు, రాంబాబు పాల్గొన్నారు.

కిరణ్ ముద్దు ఇంకెవరూ వద్దు

ప్రజాశక్తి- లావేరు

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమారే మాకు ముద్దు... ఇంకెవరూ వద్దని, సిఎం జగన్ అందరికీ ముద్దేనని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి డి.రాజినాయుడులు స్పష్టం చేశారు. లావేరులో సోమవారం విలేకరలతో మాట్లాడారు. వ్యక్తిగత కక్షలు పార్టీపై రుద్దడం సరికాదన్నారు. సీతన్నాయుడు, మండల ఉపాధ్యక్షులు లుకలాపు శ్రీనివాసరావు, మండల వైసిపి కన్వీనర్ పార్టీలో ఉంటూ వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వారని, నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నారని అన్నారు. మండలంలోని 33 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ముఖ్య నాయకులు ఎమ్మెల్యేకే మద్దతు ప్రకటిస్తూ... తీర్మానం చేశారని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు మీసాల శ్రీనివాసరావు, బొంతు సూర్యనారాయణ, గొర్లె అప్పలనాయుడు, జగ్గురోతు తవిటినాయుడు, లంకలపల్లి గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ

ఘనంగా ఛత్రపతి సాహు జయంతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు సాధించడానికి ఉద్యమించిన సామాజిక వేత్త చత్రపతి సాహుమహారాజ్ అని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్ట చంద్రపతిరావు అన్నారు. సోమవారం ఆయన 140 జయంతి వేడుకలు నగరంలోని మహాత్మా జ్యోతీరావు పూలే పార్కులో నిర్వహించారు. పార్కులో ఉన్న ఛత్రపది విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

కార్యక్రమంలో బుడుమూరు రాజేష్ గుత్తు చిన్నారావు, కంట వేణు, తిప్పాన గాంధీ, కొనాడ నరసింగరావు, ఇప్పిలి చిన్నారావు, అడపాక రాంబాబు, కర్రీ రంగాజీ దేవ్, మైలపల్లి కూర్మారావు పాల్గొన్నారు.

బంకించంద్ర ఛటర్జీ...

స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో ప్రతి భారతీయుడు గుండెను రగిలించిన శక్తివంతమైన గీతం వందేమాతరం అని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, విగ్రహ దాత నిక్కు అప్పన్న నాయకులు అన్నారు. వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర చటర్జీ 185వ జయంతిని నగరంలోని గాంధీ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. స్వాతంత్రోద్యమ కాలంలో బెంగాల్ విభజనకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు సమరయోధులు అందరూ వందేమాతర ఉద్యమాన్ని నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, మెట్ట అనంతం బట్లు, కొంఖ్యనా వేణుగోపాల్, పొన్నాడ రవికుమార్, పందిరి అప్పారావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు పాల్గొన్నారు.

సిఎంకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో రాజకీయ లబ్ధిపొంది ఎలాగైనా మరలా ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తరగతుల మధ్య కుంపట్లు పెడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. మండలంలోని కింతలి, తాడివలస, తాణెం, బురిడికంచరాం, లోలుగు, తోలాపి, దల్లవలస గ్రామాల్లో టిడిపి సానుభూతుపరుల కుటుంబాలను సోమవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతో రాష్ట్రంలో వైసిపి మంత్రులు, నాయకుల తరగతుల మధ్య చిచ్చురేపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం గౌరవం లేదని, అధికారం కోసం ఎంతటి పనికైనా వెనుకాడరని ఆరోపించారు.

ఆర్థికంగా దివాలతీసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు గెలుపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కాపు రిజర్వేషన్ అంటూ ఉద్యమాలు చేసిన ముద్రగడ పద్మనాభం వైసిపి ప్రభుత్వం కాపులకు ఏమి రిజర్వేషన్ ఇచ్చిందని మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ముద్రగడకు కాపుల ప్రయోజనాల కన్నా వైసిపి ప్రయోజనాలే ముఖ్యమని తెలిపోయిందని పేర్కొన్నారు. ఈయనతో వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వండాన మురళి, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, కింతలి ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవల గణపతిరావు, చోళ్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న రవికుమార్

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం పాటు ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న రాజకీయ వేత్త బొడ్డేపల్లి రాజగోపాలరావు అని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద టిడిపి ఆధ్వర్యాన రాజగోపాలరావు శత జయంత్యుత్సవాలను సోమవారం నిర్వహిం చారు. ముందుగా రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయ మన్నారు. రాజకీయా లకతీతంగా ఆయనను స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. జిల్లాను సస్యశ్యామలంగా మార్చాలన్న ఆయన కన్న కలలు నెరవేర్చడానికి నిరంతరం కృషి జరగాలన్నారు. జిల్లా ప్రగతిలో ఆయన స్థానం కీలకమని, వంశధార ప్రాజెక్టు, ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటులో ఆయన పాత్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, చింతు సుధాకర్, కోరాడ హరిగోపాల్, జామి భీమశంకర్, గంగు నాగేశ్వరరావు, గుత్తు చిన్నారావు, విభూది సూరిబాబు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు


వజ్రపుకొత్తూరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న గిరిజ

విత్తనాల పంపిణీ

వజ్రపుకొత్తూరు: రైతుల పక్షపాతి సిఎం జగన్ అని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు, రాజాం సర్పంచ్ పిట్ట గీతారాణి అన్నారు. గరుడభద్ర సచివాలయంలో రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను ఎంపిటిసి పిట్ట సుగణ సోమవారం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అనుకున్న సమయానికి ముందే విత్తనాలను రైతు భరోసా కేంద్రానికి చేర్చి తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని అన్నారు. కార్యక్రమంలో వై.ఆనందరావు, వై.ధర్మారావు, పి.జోగారావు, ఎం.చంద్రభూషణ్, కె.రామారావు, వై.శేఖర్, టి.పున్నయ్య, చెళ్లురు రాకేష్, వై.శ్రీను, అగ్రికల్చరల్ అసిస్టెంట్ అవినాష్, కార్యదర్శులు మోహనరావు, కళ్యాణి పాల్గొన్నారు.

కంచిలి : మండలంలోని బోగాబెని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సర్పంచ్ గణప సింహాచలం వరి విత్తనాలను అందజేశారు. సాంబ, స్వర్ణ, 1061, 1064 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి బి.వైకుంఠరావు, వ్యవసాయశాఖ పాల్గొన్నారు.

30న లావేరు మండల సమావేశం

లావేరు : ఈ నెల 30న మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నిశాఖాధికారులతో పూర్తి సమాచారంతో, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. పురపాలక సంఘం కార్యాలయం వద్ద మెప్మా అధ్యక్షతన పట్టణ సమైఖ్య సంఘాల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అవగాహన కల్పించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు బి.రాము, బి.భాస్కర్, మెప్మా సిఎంఒ జానకిరావు, సిఒ సంతోష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి


మాట్లాడుతున్న తహశీల్దార్ సరోజిని

సోదరభావంతో మెలగాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఎస్‌సి, ఎస్‌టిలు సోదరు భావంతో మెదగాలని తహశీల్దార్ పి.సరోజని అన్నారు. పౌర హక్కుల దినోత్సవ సందర్భంగా మండలంలోని సూర్జినిలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వివక్షత లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రతి ఒక్క పౌరుడికీ సమాన హక్కులు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. అందరూ కలిసిమెలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, డివిజనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గేదెల రమణమూర్తి, మండల ఎఒ దానకర్ణుడు, ఆర్ఐ వైకుంఠరావు, కృష్ణారావు, విఆర్ఒ అన్నాజీరావు, ఎఎస్ఐలు నర్సింగరావు, అప్పన్న, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

నందిగాం: మండలంలోని సవరలింగపురం, సవర రామకృష్ణాపురం, లింగుపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ జి.నరసింహులు శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం పాఠశాల పరిశీలన పరిశీలించి పలు సూచనలు చేశారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమణ

డిఎల్‌పిఒ సందర్శన

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురం గ్రామ సచివాలయం, చెత్త సంపద కేంద్రాన్ని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ సోమవారం సందర్శించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామాల్లో డ్రెయినేజీ, కాలువలను పరిశీలించి పలు సూచించారు. కాలువల్లో పూడికలను తొలగించి క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. లైబ్రరీ సెస్ వసూలు వేగవంతం చేయాలన్నారు. ఈయన వెంట ఇఒఆర్‌డిఒ తారకేశ్వరి, కార్యదర్శి చింతల అప్పారావు, సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు

ఇచ్ఛాపురం : మండలంలోని బాహుదా నదిలో రెండు లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరయ్యాయని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అభ్యర్థుల మేరకు సిఎం జగన్మోహన్‌రెడ్డి బాహుదాపై లొద్దపుట్టి, ఈదుపురాలకు రెండు లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ధనుంజయరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. ఈ ప్రాంత రైతాంగం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న బాహుదా లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు.



పథకాలను వివరిస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే 'భవిష్యత్ గ్యారంటీ'

పలాస: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అధికారంలోకి టిడిపి రావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు కోసంగిపురంలో సోమవారం చంద్రబాబుతోనే భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారని ఆరోపించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టిడిపి మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో లోడగల కామేష్, పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, నవీన్, కృష్ణారావు, కృష్ణమూర్తి, శ్రీను, సత్యం, ఆత్మారావు పాల్గొన్నారు.

ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

జలుమూరు: మండలంలోని టెక్కలిపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. స్పందన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని తామాడా పంచాయతీ మాజీ సర్పంచ్ గొర్లె ఉగాదినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకర్గ వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు మృతుడి స్వగ్రామం రాయనింగరిపేటకు వెళ్లి ఆయన కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఈయన వెంట మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, ఎస్.నాగరాజు, లంకలపల్లి మలేశ్వరరావు, మీసాల నారాయణరావు, పి.గురునాయుడు ఉన్నారు.



పరామర్శిస్తున్న అప్పలనాయుడు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



టెక్కలి రూరల్ : మొక్కను నాటుతున్న కృపారాణి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. మండలంలోని రావివలస కోనేరు గట్టుపై సర్పంచ్ సర్లాన బాలకృష్ణ అధ్యక్షతన సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పేరిట చెట్లు, అడవులు నరికి వేయడంతో విఘాతం కలిగిస్తుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు భావితరాల కోసం అడవులను పెంచాలని పిలుపు నిచ్చారు. ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి అట్లా సరోజనమ్మ, వైస్ ఎంపిపి మున్నెల కిషోర్, ఎంపిటిసి సత్తారు ఉషారాణి సత్యం, శ్రీధర్‌రెడ్డి, రాంబాబు, మోహనరావు ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్ పాల్గొన్నారు.

జలుమూరు: పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లింగాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉంగటి అప్పల సూర్యనారాయణ పిలుపునిచ్చారు. లింగాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సత్యసాయి సేవా సమితి సభ్యులు అందజేసిన మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, జె.రమణమూర్తి, డి.విశ్వనాథం, డి.కాత్యాయిని, చిట్టెమ్మ, దమయంతి కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



జలుమూరు : మాట్లాడుతున్న ఎంఇఒ మాధవరావు

జలుమూరు: తల్లిదండ్రుల కమిటీలతో పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఎంఇఒ బమ్మిడి మాధవరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ప్రణాళిక వేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల సింహాచలం అన్నారు. పాఠశాల ఆవరణలో పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, డిజిటల్ విద్యా విధానంలో బోధించేందుకు ఫ్లాట్ ప్యానెల్ పరికరాలు, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలన్నింటినీ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.అప్పారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.వెంకటరమణ (భీష్మ), సహ ఉపాధ్యాయులు శివరామ ప్రసాద్‌పాడి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజేష్

కొత్తూరు : మండలంలోని దిమిలిలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు డిఎంహెచ్‌ఒ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వంద మంది రోగులకు నెప్రాలాజిస్టు వైద్యాధికారి రాజేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, నాయకులు గార రాజులునాయుడు, కె.త్రినాథరావు, దారపు రాము, కృష్ణ పాల్గొన్నారు.

గోకర్ణపల్లిలో...

పొందూరు : మండలంలోని గోకర్ణపల్లిలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 24 మందికి ప్రత్యేక వైద్య పరీక్షలను సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్, వైద్యులు కె.భానుసాయి, స్టాఫ్‌నర్స్ ఆర్.శైలజ, ఆస్పత్రి సిబ్బంది జి.చిరంజీవి, ఐ.చంద్రశేఖర్, ఎన్.రాజు, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష పథకమని జెసిఎస్ మండల కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. మండలంలోని కొత్తపల్లి, చిన్నసాన సచివాలయాల పరిధిలోని గృహ సారథులకు, వాలంటీర్లకు సోమవారం జగనన్న సురక్షపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాము, బి.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ గృహ సారథులకు, వాలంటీర్లకు జగనన్న సురక్షపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ పప్పల



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న నాగభూషణరావు

వేణుగోపాలరావు, ఎంపిడిఒ కె.నిశ్చల, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని రథజన, బొడ్డపాడు, కాపుతెంబూరు సచివాలయాల్లో సచివాలయ మండల కన్వీనర్ జి.జయరాం జగనన్న సురక్షపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గోవిందరావు, సర్పంచ్‌లు పోలాకి మోహనరావు, తిరుపతిరావు, బలరాం స్వామి, కన్వీనర్లు తిర్లంకి వెంకటరావు, చిరంజీవులు, జనార్ధనరావు, కార్యదర్శి ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

కృష్ణదాస్ జన్మదిన వేడుకలకు సన్నాహాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

జులై 7న వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు భారీగా సన్నాహాలు నిర్వహించాలని డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరరావు అన్నారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో ఆయా మండలాల ఎంపిపి ఆధ్వర్యాన వైసిపి నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కోవిడ్ కారణంగా మూడేళ్ల పాటు జన్మదిన వేడుకలు నిర్వహించలేదని అన్నారు. ప్రస్తుతం ఆ సమస్య దాదాపుగా తొలగిపోవడంతో ఈ ఏడాది భారీగా నిర్వహిస్తున్నామని అన్నారు. సమావేశంలో ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, జెడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, కోరాడ చంద్రభూషణ్ గుప్త, సురంగి నరసింగరావు, సదాశివుని కృష్ణ, బొబ్బది ఈశ్వరరావు పాల్గొన్నారు.

జీయన్నపేటలో గడప గడపకు...

కోటబొమ్మాళి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక సంక్షేమ పాలన కారణంగా ప్రతి గడపా స్వాగతం పలుకుతున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని జీయన్నపేట పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి గడపలో ఎదురొచ్చి తనకు స్వాగతాలు పలకడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, వైస్ ఎంపిపిలు దుక్క రామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు, జిల్లా రైతు భరోసా అడ్వైజర్ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, కాళ్ల సంజీవరావు పాల్గొన్నారు.



బీజామృతం తయారు చేస్తున్న రైతులు

బీజామృతం తయారీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులతో విత్తన శుద్ధి కోసం బీజామృతాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు మాట్లాడుతూ తొలకరి వర్షాలు మొదలవ్వడంతో రైతులందరూ వరి విత్తనాలను పొలాల్లో చల్లుతున్నారని అన్నారు. విత్తనాలను విత్తన శుద్ధి చేయడం కోసం చేపేనపేట క్లస్టర్ యూనిట్‌లోని గ్రామాల్లో రైతులకు అందుబాటులో బీజామృతాన్ని తయారు చేసి ఉంచుతున్నామని అన్నారు. రైతులందరూ ఈ బీజామృతాన్ని తప్పనిసరిగా వినియోగించుకొని విత్తనాలను శుద్ధి చేసుకుని పొలాల్లో వేసుకోవాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల విత్తనాలు పూర్తిగా మొలక శాతం వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతిరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

అన్నపూర్ణ పథకానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు, వరం ఛారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ అంధవరపు ప్రసాద్ తన పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా సర్వజనాస్పత్రిని సందర్శించి నిత్యాన్నదాన కోసం నిర్వహిస్తున్న అన్నపూర్ణ పథకానికి రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు. అనంతరం అన్నపూర్ణ సేవ అధ్యక్షులు గంగుల రమణబాబుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కిల్లాన ఫాల్గుణరావు, రామచంద్రరావు, మురళి, లక్ష్మణరావు పాల్గొన్నారు.